క్లుప్తంగా

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఆనందపురం : వాతావరణ కాలుష్యం నివారణకు విరివిగా మొక్కలు నాటాలని వెంకటాపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జయభారతి సూచించారు. గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో సేవా శిబిరం సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు పెంచే బాధ్యతను యువత తీసుకోవాలని కోరారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కాలుష్యంపై ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం కో – ఆర్డినేటర్ పవన్‌పుత్ర పాల్గొన్నారు.

ఘనంగా పట్టభద్రుల దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న అతిథులు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు ఇన్‌క్రెడిబుల్, సాయిరవీంద్ర ప్లే స్కూళ్ల పట్టభద్రుల దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ వేడుకలు నిర్వహించారు. ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులను పట్టభద్రుల గౌన్లలో అలంకరించి సర్టిఫికెట్లు, పతకాలు అందించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త రంగూరి రాంబాబు, సామాజిక కార్యకర్త వెంపాడ శ్రీనివాసరెడ్డి, పాస్టర్ స్టీఫెన్, కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్‌కుమార్ తదితరులు మాట్లాడారు. నిపుణులతో విద్యార్థులకు తరచూ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు కరస్పాండెంట్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందుమతి, కోమలి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెట్ల నిర్మాణానికి భూమిపూజ



మెట్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మహిళలు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు సత్యనారాయణపేట మార్కెట్ వైపు కొండవాలు ప్రాంతంలో మెట్లు నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. మూడేళ్ల క్రితం రూ.14 లక్షలతో నిర్మాణ పనులు ప్రారంభమైనా పాక్షికంగా జరిగి ఆగిపోయాయి. ప్రస్తుతం రూ.8.50 లక్షలతో ఈ మెట్ల నిర్మాణానికి మళ్లీ శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి తెడ్లాపు అప్పలరాజు, మైనారిటీ విభాగం వార్డు అధ్యక్షుడు షేక్ గఫూర్, నాయకులు ఎజ్జ రమణమ్మ, తెడ్లాపు కల్యాణి, షేక్ ఫాతిమా, మదీనా, కనక, శీరప్ప పైడిరాజు, బాడితమాని పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల మెటీరియల్ పంపిణీ

తగరపువలస: వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి డబ్బీరు ప్రశాంతి సోమవారం చిట్టివలస బాలికల జెడ్పీ హైస్కూల్‌లో 35 మంది విద్యార్థినులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్.రోజామణి, తదితరులు పాల్గొన్నారు.

బూత్ ఏజెంట్లే యుద్ధంలో సైనికులు

- సీఎం జగన్‌తోనే ప్రజలందరికీ మేలు
- మరోసారి ఆయన్నే ముఖ్యమంత్రిని చేసుకోవాలి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- ఉత్సాహంగా 'మేము సిద్ధం – మా బూత్ సిద్ధం' సమావేశాలు



ఆనందపురం మండలం గిడిజాలలో ఆత్మీయ సమావేశంలో ఎన్నికలకు తాము సిద్ధమంటూ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆనందపురం : ప్రజల కష్టాలు తెలుసుకుని, వారి సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడానికి బూత్ లెవెల్ ఏజెంట్లు సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని గిడిజాలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లతో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వారిని బూత్ వరకు తీసుకెళ్లి ఓట్లు వేయించుకునేలా వైఎస్సార్ సీపీ బూత్‌లెవెల్ ఇన్‌చార్జులు కృషి చేయాలని కోరారు. భీమిలి నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సుమారు రూ.2,500 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. టీడీపీ పాలనలో పరిష్కారం కాని ఎన్నో సమస్యలు పరిష్కరించి ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వం మనదేనన్నారు. అవినీతి, బంధుప్రీతికి ఆస్కారం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించే అదృష్టం జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే దక్కిందని చెప్పారు. నూటికి 90 శాతం మందికి ఏదో ఒక పథకం ద్వారా ప్రభుత్వ సాయం అందిందని, ఈ విషయాన్ని నాయకులు, కార్యకర్తలు ప్రజల దృష్టికి తీసుకెళ్లి మరలా జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితేనే పథకాలు కొనసాగుతాయని గుర్తు చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సాయం నేరుగా ప్రజలకే అందేలా ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పొరపాటున టీడీపీకి అవకాశమిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసి జన్మభూమి కమిటీల ద్వారా మరలా అవినీతికి తెరలేపుతారన్నారు. ఈ మేరకు నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి భీమిలిలో తనను ఎమ్మెల్యేగా గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, మండల కన్వీనర్ల అధ్యక్షుడు గంగిరెడ్డి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, నాయకులు డోల దేవుడు, పాండ్రంకి అప్పారావు, లెంక రాంబాబు, బొట్టా రామకృష్ణ, కోరాడ అప్పలస్వామి నాయుడు, పిన్నింటి వెంకటరమణ, కాకర వెంకటరమణ, షిణగం అప్పలరాజు, రౌతు శ్రీను, చందక సూరిబాబు, గుసిడి వెంకట రమణ, కోన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటినీ ఐదుసార్లు సందర్శించాలి

తగరపువలస: నియోజకవర్గంలోని ప్రతీ ఇంటినీ బూత్ కమిటీ ఆధ్వర్యంలో గృహ సారథులు, కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు ఎన్నికలు జరిగేలోపు కనీసం ఐదుసార్లు సందర్శించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. భీమిలి మండలం అన్నవరంలో మండల బూత్ కమిటీల ప్రతినిధులతో 'మేము సిద్ధం – మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు సవివరంగా వివరించాలన్నారు. పెత్తందార్లకు, పేదలకు మధ్య జరుగుతున్న ఈ యుద్ధంలో సామాన్య ప్రజలే సీఎం వైఎస్ జగన్‌కు స్టార్ క్యాంపెయినర్లన్నారు. పొరపాటున చంద్రబాబు, పవన్‌కు అధికారం కట్టబెడితే మళ్లీ ప్రజలు కాళ్లరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడమే కాకుండా లంచగొండితనం, అవినీతి పెరిగిపోతుందన్నారు. ప్రస్తుత సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకే ఓటేసేలా ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో భీమిలి జోన్, మండలానికి చెందిన గృహసారథులు, కన్వీనర్లతోపాటు వైఎస్సార్‌సీపీ రీజినల్ యూత్ కో ఆర్డినేటర్ ముత్తంశెట్టి నందీష్, వ్యవసాయశాఖ సలహా మండలి జిల్లా చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథ రెడ్డి, శిల్ల కరుణాకరరెడ్డి, జిల్లా కార్యదర్శులు జీరు వెంకటరెడ్డి, మద్దిల వెంకటరమణ, అధ్యక్షులు జగుపల్లి ప్రసాద్, చిల్ల హరి, వాసుపల్లి కొండబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మేరుగు ఎల్లాజీ, బొడ్డు దుర్గారావు, వెంపాడ సూరిబాబు, కాద సూర్యనారాయణ, పొట్నూరు చంద్రశేఖర్, మజ్జి సూరినాయుడు, కొయ్య వెంకట అప్పల సూర్యనారాయణరెడ్డి, తుపాకుల అప్పలరాజు, సమ్మిడి శ్రీనివాసరావు, కొయ్య రామకృష్ణారెడ్డి, శిరుగుడి ఈశ్వరరావు, లచ్చుబుగత జగదీశ్వరరావు, చెల్లూరి నగేష్, పల్లా సన్యాసిరావు, ముద్దాడ రామ సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.



అన్నవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

వైఎస్సార్‌సీపీలో చేరిక



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడకు చెందిన ఎండాడ యువసేన అధ్యక్షుడు సకల ప్రసాద్, ఎండాడ వర్తక సంఘం అధ్యక్షుడు రెడ్డిపల్లి మురళీ కృష్ణ సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, లొడగల రామ్మోహన్, ఉప్పులూరి గోపి, మాదు బుజ్జి, అల్లాడ ఉమామహేశ్వరరావు, నొడగల రాంబాబు పాల్గొన్నారు.

రైతుబజారులో విక్రయాలు ప్రారంభించాలి

తగరపువలస: చిట్టివలసలో ఇటీవల ప్రారంభించిన రైతుబజారులో విక్రయాలు ప్రారంభిచేందుకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవ తీసుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం గుజ్జు రామునాయుడు భవన్‌లో వీరు మాట్లాడారు. ఇండియా కూటమిలోని భాగస్వాములను కలుపుకుని రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ, బీజేపీ, జనసేన, టీడీపీలకు ప్రత్యామ్నాయంగా మూడో ఫ్రంట్‌తో రానున్న ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించారు. మోర అప్పలరాజు, చిల్ల నరసింహులు, అల్లు బాబూరావు, కానూరి రాంబాబు, మావూరి వీర్రాజు, నూలు ఆదినారాయణ పాల్గొన్నారు.

రూ.5 కోట్లతో ఘాట్ రోడ్డు అభివృద్ధి



పద్మనాభం గిరిపై పార్కింగ్ కోసం పొక్లెయిన్‌తో రాయి తొలగిస్తున్న దృశ్యం



బీటీ రహదారిగా మారనున్న మట్టి ఘాట్ రోడ్డు

- 3.3 కిలో మీటర్ల మేర బీటీ రహదారి నిర్మాణం
- అనంతుని భక్తుల కలలు సాకారం

పద్మనాభం : అనంత పద్మనాభ స్వామి భక్తుల చిరకాల స్వప్నం సాకారం కానుంది. గిరిపై కొలువైన స్వామిని దర్శించుకునేందుకు కొద్దిరోజుల్లో సులువుగా రోడ్డు మార్గంలోనే చేరుకోవచ్చు. కొండపైకి రూ.5 కోట్లతో ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దేశంలో రెండోదిగా ప్రఖ్యాతి గాంచిన అనంత పద్మనాభుని ఆలయం పద్మనాభం గ్రామంలో గిరిపై ఉంది. కేరళ రాష్ట్రం తిరువనంతపురంలోని ఆలయం తర్వాత అంతటి ప్రాచుర్యం పొందిన పద్మనాభుని సన్నిధికి చేరుకునేందుకు చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. కొండపైకి చేరుకునేందుకు ఉద్దేశించిన ఘాట్ రోడ్డు పనులు టీడీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఐదేళ్ల పాలనలో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయకుండా వదిలేశారు. రక్షణ గోడలు కూడా నిర్మించ లేదు. దీంతో వాహనాలతో గిరిపైకి వెళ్లడానికి భక్తులు భయాందోళన చెందుతున్నారు. ఘాట్ రోడ్డు ప్రయాణం సురక్షితం కాకపోవడంతో భక్తులు మెట్ల మార్గం ద్వారా గిరిపైకి వెళ్లి అనంతుని దర్శించుకుంటున్నారు. త్రిభుజాకారంలో అత్యంత ఎత్తులో ఉండే అనంతుని గిరి పైకి 1,286 మెట్లు ఎక్కేందుకు చాలా మంది భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, దివ్యాంగులు మెట్ల మార్గం ద్వారా గిరిపైకి వెళ్లలేక ప్రథమ పావంచా వద్ద మొక్కులు చెల్లించుకుని వెనుదిరుగుతున్నారు.



రక్షణ గోడ నిర్మించనున్న రోడ్డు ప్రాంతం

వైఎస్సార్‌సీపీ నాయకుల చొరవతో...

ఈ నేపథ్యంలో ఘాట్ రోడ్డును బీటీ రహదారిగా అభివృద్ధి చేయాలన్న భక్తుల కలలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సాకారమవుతున్నాయి. అనంతుని ఘాట్ రోడ్డును అభివృద్ధి చేయాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, తదితర స్థానిక నాయకులు పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. విషయాన్ని వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో... స్పందించిన సీఎం జగన్ ఘాట్ రోడ్డు అభివృద్ధికి పంచాయతీ రాజ్ నిధులు రూ.5 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో వారం రోజుల నుంచి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 3.3 కిలో మీటర్ల నిడివి గల మట్టి ఘాట్ రోడ్డును బీటీగా అభివృద్ధి చేయనున్నారు. అనంతుని కన్నయ్య కోనేరు సమీపంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి అర కిలోమీటరు నిడివి వరకు 7.5 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మిస్తారు. ఇందులో 3.5 మీటర్ల వెడల్పు బీటీగా, మిగిలిన భాగం రెండు వైపులా మట్టితో అభివృద్ధి చేస్తారు. గిరిపైకి చేరుకునేంత వరకూ మిగతా 2.8 కిలో మీటర్ల నిడివినీ 5.5 మీటర్ల వెడల్పు బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయనున్నారు. అవసరమైన చోట రక్షణ గోడలు నిర్మిస్తారు. కొండ పైనుంచి నీరు కిందకు పోయేందుకు అనువుగా మూడు చోట్ల కల్వర్టులు నిర్మిస్తారు. గిరిపై ప్రస్తుతమున్న పార్కింగ్ ప్రాంతాన్ని విస్తరిస్తున్నారు. ప్రస్తుతమున్న పార్కింగ్ ప్రాంతం పది కార్లు నిలిపేందుకు కూడా సరిపోదు. దీన్ని సుమారు 50 కార్లు నిలిపేందుకు వీలుగా విస్తరిస్తున్నారు. పార్కింగ్ ప్రాంతాన్ని విస్తరించడానికి పొక్లెయిన్‌తో రాయి తొలగిస్తున్నారు. ఇప్పటికే కింద నుంచి పైవరకు ఘాట్ రోడ్డును రోలర్‌తో చదును చేశారు. మరోవైపు అక్కడక్కడా వ్యూ పాయింట్‌లో పర్యాటకుల కారు పార్కింగ్ కోసం ఏర్పాటు చేస్తారు. ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తయ్యేలా యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నారు. ఘాట్ రోడ్డు బీటీగా రూపాంతరం చెందితే వాహనాలు పైకి వెళ్లే మార్గం సుగమమవుతుంది. దీంతో భక్తుల సంఖ్య మరింత పెరిగి అనంత పద్మనాభుని ఆలయం దివ్య క్షేత్రంగా విరాజిల్లుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం జగన్ సారథ్యంలోనే 'నగరాలు'కు గుర్తింపు



సమావేశంలో సంఘీభావం తెలియజేస్తున్న నగరాలు కుల పెద్దలు, పోతిన శ్రీనివాసరావు, తదితరులు

మధురవాడ: నగరాలు కులానికి ప్రత్యేక గుర్తింపునిచ్చి, ప్రోత్సహించింది దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని నగరాలు కుల పెద్దలు, ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతోపాటు రెండు సార్లు చైర్మన్ పదవి మధురవాడ ప్రాంతానికి చెందినవారికి ఇచ్చారన్నారు. తమకిచ్చిన గౌరవానికి కృతజ్ఞతగా బుధవారం మధురవాడ శిల్పారామం జాతరలో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును సత్కరిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా మద్దతు తెలియజేస్తామని తెలిపారు. నగరాలను బీసీ ఏలో చేర్చాలని, తమ కుల సామాజిక భవనం నిర్మాణానికి ప్రభుత్వం ఎకరా స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నగరాలు కుల పెద్దలు పోతిన హనుమంతురావు, జగ్గుపిల్లి అప్పలరాజు, పీకేఎం పాత్రుడు, పిళ్లా సూరిబాబు, వాండ్రాసి రవి, పిళ్లా రమణ, పోతిన సుమన్ వెంకటరావు, నాగోతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది చైతన్యంతోనే భద్రత



మాట్లాడుతున్న రీజినల్ అగ్నిమాపక శాఖాధికారి నిరంజన్‌రెడ్డి

తగరపువలస: భద్రత విషయంలో సిబ్బంది ఎల్లవేళలా చైతన్యంగా వుంటూ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించాలని రీజినల్ అగ్నిమాపక శాఖాధికారి డి.నిరంజన్‌రెడ్డి అన్నారు. భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీలో భద్రతా మాసోత్సవాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థల యాజమాన్యాలు కార్మికుల భద్రతకు పెద్దపీట వేస్తూ అత్యాధునిక రక్షణ విధానాలను అవలంభించాలని సూచించారు. జిల్లా అగ్నిమాపక శాఖాధికారి ఎస్.రేణుకయ్య అగ్నిమాపక పరికరాల ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భద్రతకు సంబంధించి చుట్టుపక్కల గ్రామాల్లోని వారిని సంస్థ భాగస్వామ్యులను చేస్తుందన్నారు. నెల రోజులపాటు నిర్వహించనున్న కార్యక్రమాల్లో భాగంగా కార్మికులకు వివిధ పోటీలు నిర్వహించనున్నారు. సంస్థ డైరెక్టర్ దేవేందర్, ఉపాధ్యక్షుడు ఎల్‌వీ రమణ, జనరల్ మేనేజర్లు కె.సుబ్బారావు, వైఎస్ కోటేశ్వరరావు, భద్రతా విభాగం అసిస్టెంట్ మేనేజర్ ఎం.చంద్రశేఖర్, తాళ్లవలస అగ్నిమాపక కేంద్ర అధికారి జి.శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

'వయోశ్రీ యోజన'తో ఎంతో మేలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: ప్రభుత్వం నిర్వహిస్తున్న 'వయోశ్రీ యోజన' ద్వారా ఎంతో మందికి మేలు జరుగుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అలిమ్‌కో సహకారంతో వయోజనులకు ఉపకరణాలు అందివ్వడానికి సోమవారం నిర్వహించిన గుర్తింపు శిబిరంలో ఆయన పాల్గొన్నారు. వయోజనులకు కళ్లద్దాలు, చేతి కర్రలు, పళ్ల సెట్లు, ఊత కర్రలు తదితర ఉపకరణాలు అందివ్వడానికి నిర్వహిస్తున్న శిబిరంతో అందరికీ ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ ఉపకరణాలు అందివ్వడానికి ప్రభుత్వం తగిన సాయం అందిస్తోందన్నారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ ఎవరికి ఏ ఉపకరణం అవసరమో గుర్తించి పేర్లు నమోదు చేయిస్తున్నామన్నారు. కొద్ది రోజుల్లో వారికి అందిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఈ సాయం వృద్ధులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో పేర్లు నమోదును పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ప్రారంభం



ఉచిత శిక్షణ ప్రారంభంలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు

తగరపువలస : సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు సోమవారం నుంచి ప్రారంభించారు. శిక్షణా కేంద్రంలో గణితం, ఫిజిక్స్, సైకాలజీ, సోషల్ సబ్జెక్టులను ప్రతీ రోజూ సాయంత్రం 5 గంటల నుంచి 6.30 వరకు నిర్వహిస్తామన్నారు. సెలవు రోజుల్లోనూ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంటాన మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, గౌరవ అధ్యక్షుడు ఎస్.పి.రవిశంకర్, ఉపాధ్యాయులు పి.నాగేశ్వరరావు, సూర్యారావు, డి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో ఉచిత వైద్య శిబిరం రేపు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో ఈ నెల 6న ఉచిత ప్లాస్టిక్ సర్జరీ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ బ్లాక్‌లో ఏర్పాటు చేయనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణం మొర్రి, డయాబెటిక్ ఫుట్, పురుషులలో రొమ్ము గ్రంధి పెరుగుదల, బోదకాలు, కిలాయిడ్ చికిత్సలు, కాలిన గాయాలు, విరిగిన చేతులు, కాళ్లు, వాస్కులర్ సమస్యలకు ఈ శిబిరంలో వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేయనున్నట్లు తెలిపారు. దీంతో పాటు ప్లాస్టిక్ సర్జరీ, కాస్మోటిక్ సర్జరీలకు సంబంధించిన చికిత్సలు ఉచితంగా చేస్తామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా రూ.6 వేలు ఖరీదైన కలర్ డాప్లర్, ఎక్స్‌రే, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'బొట్టవానిపాలెం రహదారిలో అడ్డంకి తొలగించండి'



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

మధురవాడ : జీవీఎంసీ 5వ వార్డు బొట్టవానిపాలెం రామాలయం నుంచి మెయిన్‌రోడ్డుకి వెళ్లే 10 అడుగుల రహదారిలో అడ్డుకట్ట వేశారని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని, చర్యలు చేపట్టాలని స్థానికుడు సూరిబాబు ఫిర్యాదు చేశారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో సూపరింటెండెంట్ అప్పలరాజు ఆధ్వర్యంలో సోమవారం 'స్పందన' నిర్వహించారు. మొత్తం 11 అర్జీలు వచ్చాయి. మిథిలాపురి వుడా కాలనీలో తాగునీటి కనెక్షన్ ఏర్పాటు చేయాలని యూవీ కొండలరావు కోరారు. బ్లూసిటీ రహదారిలో సీసీ రోడ్డు పూర్తి చేయాలని శివశక్తినగర్‌కి చెందిన కె.రామ్మూర్తి కోరారు. జీవీఎంసీ 6వ వార్డు గాయత్రి ఇంజినీరింగ్ కాలేజీ అవుట్ గేట్ రేవళ్లపాలెం వద్ద ఉన్న నారాయణ సాయి ప్యారడైజ్‌కి చెందిన 20 యూనిట్ల ప్లాట్లకు, 5వ వార్డులోని ప్రెసిడెంట్ ఆఫ్ సాయిటవర్స్ అపార్ట్‌మెంట్‌కు జీవీఎంసీ వాటర్ కనెక్షన్, డ్రైనేజీ, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని అపార్ట్‌మెంట్ వాసులు కోరారు. మధువాడలో గల హాస్టల్స్‌కి జీవీఎంసీ వాటర్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని, సిరి నివాసం అపార్ట్‌మెంట్ దగ్గర స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు, ఎండాడ దసపల్లా లే అవుట్‌కి డ్రైనేజీ, రోడ్డు సదుపాయం కల్పించాలని వినతిపత్రాలు అందించారు. సమస్యల పరిష్కారానికి జోనల్ కమిషనర్ ద్వారా చర్యలు చేపడతామని అప్పలరాజు హామీ ఇచ్చారు.

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'కు నాలుగు వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి మూడు, ఇంజినీరింగ్ విభాగానికి ఒక వినతి వచ్చింది. వినతులు పరిశీలించి త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని జెడ్సీ తెలిపారు.

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల పెళ్లి రాట ఉత్సవం



శివాలయం వద్ద పెళ్లి రాట వేస్తున్న భక్తులు

పద్మనాభం : మండలంలోని విలాస్కాన్‌పాలెంలోని రామలింగేశ్వర ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల పెళ్లి రాట ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్వతి పరమేశ్వరుల కల్యాణం ఈ నెల 6న నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పెళ్లి రాట వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లి సత్యవతి, బాందేవుపురం ఎంపీటీసీ సభ్యురాలు బోని సావిత్రి పాల్గొన్నారు.